# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 275 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 10 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




## అమల్లోకి భూభారతి చట్టం

**బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్**

**సత్వరం చట్టం అమలకు చర్యలు తీసుకుంటాం**

**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి**

**హైదరాబాద్, జనవరి 9 (ప్రభాత ఉదయం):** 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని

..మిగతా 2లో

## ఫార్ములా కేసులో ముగిసిన
# కేటీఆర్ విచారణ

**ఆరున్నర గంటలపాటు విచారించిన అధికారులు**

**నిధుల మళ్లింపుపై ముగ్గురు అధికారుల ఆరా**

**విచారణ సమయంలో హాజరైన అడ్వకేట్ రామచంద్రరావు**

**రేవంత్ ప్రశ్నలనే ఏసిబి అడిగిందన్న కెటిఆర్**



**హైదరాబాద్, జనవరి 9 (ప్రభాత ఉదయం):** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కాగా..దాదాపు ఆరున్నర గంటలపాటు ఏసిబి అధికారులు చేసిన విచారణ ముగిసింది. ఫార్ములా కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేం దుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో

..మిగతా 2లో

## తిరుపతి ఘటనలో నిర్లక్ష్యానికి మూల్యం

**డిఎస్పీ రమణకుమార్...గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిలపై వేటు**

**ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ల బదిలీ**

**ఇవో సహా అధికారుల తీరుపై సిఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం**



**తిరుపతి, జనవరి 9 (ప్రభాత ఉదయం):** తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై తితిదే పరిపాలన భవనంలో సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. 'డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం అని ప్రకటించారు. తితిదే ద్వారా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి రూ.5 లక్షల

..మిగతా 2లో







## ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును
## ప్రారంభించిన ప్రధాని మోదీ





**భువనేశ్వర్, జనవరి 9 (ప్రభాత ఉదయం):** విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది. ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను.. ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ చేశారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు.. ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై,

..మిగతా 2లో



### ఇస్రో స్పేడెక్స్ మిషన్‌లో ఆ ప్రక్రియ
## మళ్లీ వాయిదా

**న్యూఢిల్లీ, జనవరి 9 (ప్రభాత ఉదయం):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో వ్యోమనౌకల అనుసంధాన ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. ఇస్రో ఇటీవల రీషెడ్యూల్ చేసిన ప్రణాళిక ప్రకారం.. ఈ ప్రక్రియ ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 500 నుంచి 225 మీటర్లకు తగ్గించేందుకు ఓ ప్రయోగం నిర్వహించింది. అయినా రెండు శాటిలైట్స్ మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో మరోసారి స్పేడెక్స్ డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఇస్రో తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ ద్వారా

..మిగతా 2లో



# అమల్లోకి భూభారతి చట్టం

**మొదటి పేజీ తరువాయి...**

పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. ఈరోజు భూభారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూభారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆర్వోఆర్ - 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ర్వోఆర్-2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూభారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా.. ఈరోజు భూభారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూభారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనల కు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని వివరించారు.



# తిరుపతి ఘటనలో నిర్లక్ష్యానికి మూల్యం

**మొదటి పేజీ తరువాయి...**

చొప్పున సాయం చేస్తాం. గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉంది. 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం' అని చంద్రబాబు తెలిపారు. ఇకపోతే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.. ఈ ఘటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీర్ణించుకోలేకపోతున్నారు.. ఘటనపై ఆరా తీసినప్పటి నుంచి సమీక్ష సమావేశం వరకు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతూనే ఉన్నారు.. టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం.. ఇంకా కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. బాధితులను పరామర్శించిన సీఎం చంద్రబాబు.. ఆ తర్వాత టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. తొక్కిసలాట ఘటనతో పాటు రేపటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కూడా చర్చించినట్టుగా తెలుస్తుండగా.. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకన్న చౌదరీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, ఎస్పీ సుబ్బారాయుడు, మంత్రులు సత్యకూమార్, నిమ్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు.. తొక్కిసలాట సహా జరిగిన ఘటనలపై 40 నిమిషాలకుపైగా చర్చించారు.. అయితే, టీటీడీ ఉన్నాధికారుల తీరుపై చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు .. సమీక్షలో టీటీడీ ఈవోపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.. అజాగ్రత్తగా ఉండడం వల్లే ఇంతటి దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు.. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ని ప్రక్షాళన చేస్తానన్న నమ్మకంతోనే ప్రజలు మాకు ఓట్లు వేశారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు.. అసలు దర్శన టోకన్ల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఎందుకు పెట్టలేదు..? అని సమావేశంలో నిలదీశారు.. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఏ మాత్రం సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.



## ఇస్రో స్పేడెక్స్ మిషన్‌లో ఆ ప్రక్రియ మళ్లీ వాయిదా

**మొదటి పేజీ తరువాయి...**

వెల్లడించింది. ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు సురక్షితం గా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ డాకింగ్?ప్రక్రియ రీషెడ్యూల్ తేదీని మాత్రం ప్రకటించలేదు. మొదట స్పేడెక్స్ మిషన్‌లో డాకింగ్ ప్రక్రియను జనవరి 7న నిర్వహించేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే మిషన్‌లో కొన్ని సాంకేతిక అవరోధాలు తలెత్తడంతో జనవరి 9వ తేదీకి రీషెడ్యూల్ చేసింది. ఇవాళ కూడా డాకింగ్ సాధ్యపడకపోవడంతో మరోసారి రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది. కాగా ఇస్రో 2024 డిసెంబర్ 30న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టింది.

# ఫార్ములా కేసులో ముగిసిన కేటీఆర్ విచారణ

**మొదటి పేజీ తరువాయి...**

కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించ డానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్-న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు. ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే



తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా' అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి.

# క్షతగాత్రులకు సిఎం చంద్రబాబు పరామర్శ

**ఘటన ఎలా జరిగిందో భక్తుల నుంచి ఆరా**
**వైద్య సేవలపై అధికారులకు సూచన**
**టోకెన్ల జారీ ప్రక్రియలో మార్పు చేస్తామని సూచన**
**భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడి**
**క్షతగాత్రులకు వైకుంఠద్వార దర్శనం చేయిస్తామని హామీ**



**తిరుపతి, జనవరి 9 (ప్రభాత ఉదయం):** తిరుపతి తొక్కిసలాటలో తాము తీవ్రంగా గాయపడ్డామని.. ఈ నేపథ్యంలో తనకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలంటూ సీఎం చంద్రబాబును క్షతగాత్రులు కోరారు. వారి కోరికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. తిరుపతిలో చోటు చేసుకొన్న తొక్కిసలాటలో గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రలను సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే తోపులాట ఎలా జరిగిందో.. భక్తులను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే గతానికి.. ఇప్పటికి ఉన్న తేడా ఏమిటని ఈ సందర్భంగా భక్తులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఎలా చేస్తే బాగుండేదని కూడా ఆరా తీసారు. దీంతో ప్రస్తుత విధానం తప్పని, కొండపైన క్యైలన్లలో ఉంటేనే మేలని పలువురు సూచించారు. అదే విధంగా ఈ ఘటన గల కారణాలపై భక్తుల నుంచి ఆయన మరింత సమాచారాన్ని సేకరించారు. తిరుపతిలో తాము ఉన్న ప్రదేశంలో కనీసం లైట్లు కూడా లేవని ఈ సందర్భంగా సీఎం దృష్టికి భక్తులు తీసుకు వెళ్లారు. గేట్ తీయ్యడంతో ఒక్క సారిగా భక్తులు లోపలికి చొచ్చుకు రావడంతోనే తోపులాట జరిగిందంటూ సీఎంకు భక్తులు వివరించారు. శ్రీవారి దర్శనానికి ఎలాంటి సిస్టం పెడితే బాగుంటుంది అనే విషయాలను భక్తులను ఆయన అడిగి.. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. అయితే.. తమకు స్వామి వారి దర్శనం కల్పించాలని ఈ సందర్భంగా పలువురు భక్తులు.. సీఎం చంద్రబాబుని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులందరికీ వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. తిరుమలలో శ్రీవారి దర్శనానికి.. భక్తులందరికి ఆమోద్య యోగ్యంగా వుండే విధానాన్ని ప్రవేశ పెడతామని భక్తులకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. జనవరి 10వ తేదీన ముక్కోటి ఏక దశి. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీవారి ఆలయంతోపాటు దేశంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ క్రమంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం తిరుపతిలో టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ టోకెన్లు తీసుకొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుపతి చేరుకున్నారు. ఆ క్రమంలో బుధవారం తిరుపతిలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా.. 40 మందికిపైగా గాయపడ్డారు.



షేక్ ఫాతిమా చిత్రపటానికి నివాళులు అర్పించిన బీఎస్పీ నాయకులు

# షేక్ ఫాతిమా పేరుతో విద్యాలయాలు స్థాపించాలి

## బీఎస్పీ దేవరకద్ర నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జ్ జనంపల్లి వినోద్ కుమార్

కొత్తకోట, జనవరి 9(ప్రభాత ఉదయం)మున్సిపాలిటీ 15వ వార్డు మదీనా నగర్ కమాన్ లో బహుజన నాయకులు ఏర్పాటు చేసిన షేక్ ఫాతిమా జయంతి వేడుకలలో బీఎస్పీ దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ జనంపల్లి వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ ఫాతిమా చిత్రపటానికికి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... భారతదేశపు ముస్లిం మహిళలు, ఇతర సామాజిక వర్గాల మహిళలకు సావిత్రిబాయి పూలే తో కలిసి ఉపాధ్యాయురాలిగా సేవలు అందించారని, మహాత్మ జ్యోతిబాపూలే దంపతులు చేస్తున్న సంఘసంస్కరణలో తోడ్పాటున అందించారనీ ఈ సందర్భంగా వారిని స్మరించుకోవడం బహుజనులుగా మన అందరి బాధ్యత బాధ్యత అని ఈ సందర్భంగా వారిని కొనియాడారు. సంస్కర్తగా, సామాజికంగా అనేక ఉద్యమాలు సంస్కరణలు చేయడంలో కృషి చేశారు. షేక్ ఫాతిమా ఆధునిక భారతదేశ తొలి ముస్లిం టీచర్ అనే విషయం సావిత్రిబాయి పూలే తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలేకి రాసిన లేఖలో బయటపడింది. మహిళలకు పాఠశాలలు పెట్టేందుకు, కులవివక్షను వ్యతిరేకిస్తున్న పూలే దంపతులను జ్యోతిబా తండ్రి వెళ్లగొట్టినప్పుడు వారికి ఆశ్రయం ఇవ్వడమే గాక తమ ఇంటిలోని ఒక భాగాన్ని పాఠశాలగా ఇచ్చిన ఉదాత్తురాలు షేక్ ఫాతిమ అని ఆమెను స్మరించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షేక్ ఫాతిమా చేసిన సామాజిక కార్యక్రమాలను గుర్తించి వారి ప్రస్తావనాన్ని పాఠశాల పుస్తకాలలో చేర్చినందుకు భావితరాలకు తెలిసే విధంగా కృషిచేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా షేక్ ఫాతిమా గారి ఔదార్యాన్ని గుర్తించి ఆమె పేరున విద్యాలయాలు, కళాశాలలు , యూనివర్సిటీలు స్థాపించాలని భావితరాలకు తెలిసే విధంగా ఆమె జీవిత చరిత్రను తెలంగాణ పాఠంశాలలో చేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తెలంగాణలోని మైనార్టీ గురుకులాలకు షేక్ ఫాతిమా పేరును పెట్టాలని ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బహుజన మైనార్టీ నాయకులు సలీం, లతీఫ్, ముజీబ్, అశ్ఫక్, ఇమ్రాన్ ఖాన్, ఖాజా కుద్బుద్దిన్, మహమూద్ హబీబ్ , యునుస్,స్టీఫెన్, కిరణ్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.




సైన్ ఫేర్ లో పాల్గొన్న గద్వాల జిల్లా విద్యార్థులు

# ముగిసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి9(ప్రభాత ఉదయం) మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ సమీపంలో ఉన్న ఎస్వీకేఎం స్కూల్‌లో రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారం ఘనంగా ముగిసింది. 3 రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో రాష్ట్ర నలుమూలల నుండి 33 జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిషన్లో తమ తమ ప్రదర్శనలను నిర్వహించారు. అనంతరం ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జాతీయ స్థాయి సైన్స్ ఫేర్ కు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులతో పాటు గద్వాల జిల్లాకు చెందిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ విద్యార్థులు హాజరై తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఏడు విభాగాల్లో ప్రదర్శించిన ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను విద్యార్థులు వివరిస్తూ అవగాహన కల్పించి, అందరి మన్ననలుపొందారు. టీచర్ గైడ్ విభాగంలో గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నాగరాజు సౌత్ ఇండియా సైన్స్ ఫేర్ కు ఎంపికై నట్లు డిఎస్ఓ భాస్కర్ పాపన్న తెలిపారు.

## ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

**మొదటి పేజీ తరువాయి...**

కొచ్చి, గోవా, ఎక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్సీటీసీ కలిసి .. ప్రవాసీ రైలును స్టార్ట్ చేశారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాంగ శాఖ ప్రకారం.. రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం కూడా ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4స్టార్ హోటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.

# రూ.400 కోట్ల విలువ చేసే 4:26 ఎకరాల దేవాదాయశాఖ భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు

## హైదర్‌గూడలో గల దేవాదాయ శాఖ భూములలో వెలసిన షెడ్లను తొలగించిన అధికారులు





బుద్వేల్, జనవరి 9 (బుద్వేల్): సుమారు 35 సంవత్సరాలుగా అన్యాక్రాంతానికి గురై, ప్రైవేటు వ్యక్తుల ఆదీనంలో ఉండి ప్రస్తుతం రూ. నాలుగు వందల కోట్లు విలువచేసే 4.26 ఎకరాల దేవాదాయ శాఖ భూములను ఆ శాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. రాజేం ద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ లో ఉన్న దేవాదాయశాఖ భూములలో వెలసిన షెడ్లను నేలమట్టం చేశారు. దేవాదాయశాఖ రంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ సి.మోహన్, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, రాంబాగ్ శ్రీ ఆనంత పద్మనాభ స్వామీ దేవాలయం ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ శ్రీనివాస్, దేవాదాయ శాఖ తహసీల్దార్ హరిత, ఆర్ఐ సరిత ల నేతృత్వంలో రాజేం ద్రనగర్ పోలీసుల బందోబస్తు మధ్య దేవాదాయ శాఖ భూములలో వెలసిన మెకానిక్ షెడ్లు, కారు సర్వీస్ సెంటర్లు, క్రికెట్ ప్లే గ్రౌండ్, టీ కొట్లు, దుకాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా స్థలాలు మావి అని చెప్పుకుంటున్న వారి కుటుంబ సభ్యులు కొందరు అడుకోవడానికి వచ్చినా పోలీసులు వారిని అక్కడికి రానీయకుండ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ రంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ సీ. మోహన్ మాట్లాడుతు, స్వాధీనం చేసుకున్న భూమికి హద్దు బందులు పెట్టడానికి సర్వే కు రాస్తామన్నారు. అనంతరం ఆ భూమ లను లీజుకు ఇవ్వడానికి యాక్షన్ వేయడం జరుగుతుందన్నారు.

**విలువైన భూములు కాపాడటంలో దేవాదాయ శాఖ**

**అధికారుల విజయం :**

రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడలో గజం ధర రూ. 1.5లక్షలు పలుకుతుంది. హైదర్ గూడ జనప్రియ హితోపియ కు అనుకుని సర్వే నెంబర్లు 435, 446లలో నాలుగు ఎకరాల ఇరవై ఆరు గుంటల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఈ భూములు రాంబాగ్ లో ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామీ దేవాలయంకు చెందినవి. ఈ భూములు దేవాలయానికి దూరంగా ఉండటంతో 2015 కంటే ముందు నుంచి ఈ భూములను హైదర్ గూడ పరిసర ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది అక్రమించుకుని వారి ఆధీనంలో పెట్టుకున్నారు. కొంత కాలం వ్యవసాయం చేసి ఆ తర్వాత ఆ భూములను ఇతరులకు చిన్న చిన్న దుకాణాలు, మెకానిక్ షెడ్లు, కార్ మెకానిక్ షో రూమ్లు, క్రికెట్ గ్రౌండ్ ల కోసం అద్దెకు ఇచ్చారు. దీనిపై దేవదాయశాఖ ట్రిబ్యునల్ లో కేసు వేయగా, 2017లో దేవదాయశాఖ కు అనుకూలంగా తీర్పు వచ్చింది. స్థలం పై ఉన్న వారు తిరిగి హై కోర్టులో కేసు వేశారు. సుధీర్ఘ కాలం పాటు హై కోర్టులో కేసు కోర్టులో నడిచి 2024 సెప్టెంబరు 26న సర్వే నెంబర్లు 135, 136లో గల 4.26 గుంటల భూమి దేవదాయశాఖ కు చెం దినదే అని తీర్పు వచ్చింది. దేవదాయ భూములకు బిసెంట్ ఉండరని తీర్పులో వెలువరించారు. రెండు నెలలోపు స్థలాలను ఖాళీ చేసి దేవాదాయశాఖ కు అప్పగించాలని తీర్పులో వెలువరిం చారు. అయినా కబ్జాలో ఉన్న వారు నిర్మాణాలను తీయకపోవడంతో దేవాదాయశాఖ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య దేవాదాయ శాఖ భూములలో ఉన్న ఆక్రమణలను నేలమటం చేశారు.

**మరిన్నీ దేవాదాయ భూములు :**

అత్తాపూర్ రాంబాగ్ లో చారిత్రాత్మక దేవాలయాలు ఉన్నాయి. అందులో శ్రీ అనంత పద్మనాభ స్వామీ దేవాలయం, శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి దేవాలయం, శ్రీ దుర్గాదేవీ ఆలయం, శ్రీ చిన్న అనంతగిరి శివాలయం, సూర్య చంద్రుల దేవాలయం తో పాటు మరి కొన్ని దేవాలయాలు ఉన్నాయి. వీటికి ఉన్న చాలా వరకు భూములు కబ్జాలకు గురైనాయి. కొన్ని భూములు లీజుల "పేరుతో "ప్రైవేటు వ్యక్తుల అధీనంలో ఉన్నాయి. వాటన్నింటిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దేవాలయాల భూములపై పూర్తి స్థాయి విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలన్నారు.

**హర్షం వ్యక్తం చేసిన ఉమా మహేశ్వరీ రెడ్డి :**

హైదర్ గుడాలో దేవాలయ భూములను కాపాడిన అధికారులకు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు కే ఉమామహేశ్వరి రెడ్డి అభినందనలు తెలియజేశారు. మిగతా దేవాలయ భూములను కూడా కాపాడాలి అన్నారు.



ఉప్పర్‌పల్లికి వచ్చిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను సన్మానిస్తున్న స్థానికులు

## క్రీడలు ఆరోగ్యానికి దోహదం చేస్తాయి

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి లో గల రాపీడైజ్ బ్యాడ్మింటన్ ఫిట్నెస్ అకాడమీ ని గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సందర్శిం చారు. అకాడమీలో నూతనంగా ఏర్పాటు చేసిన పిక్బాల్ కోర్టును ఆయన ప్రారంభించారు. అనంతరం కొద్ది సేపు పిక్ బాల్ ఆటను ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులు మొదలు కొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు రోజులో గంట సేపు ఏదైన క్రీడ ఆడాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సుఖవంతమైన జీవితాన్ని జీవించడానికి అవకాశముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ అధికారి బాబురావు, బీజేపీ నాయకులు బొక్క బాల్ రెడ్డి, స్థానికులు విశ్వేశ్వర్ రావు , ప్రకాశ్, శ్రీనాథ్, సరికొండ రాజు, కిషోర్, ప్రసాద్ లు పాల్గొన్నారు.



జడ్చర్ల లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన లో బుద్వేల్ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని పల్లవి చేసిన ప్రదర్శన

## రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు బుద్వేల్ జిల్లా పరిషత్ విద్యార్థినీ పల్లవి


బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం) : మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ లో రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ పల్లవి తయారు చేసిన ఆటోమేటిక్ వాటర్ ప్లానింగ్ సిస్టమ్ ప్రదర్శనకు చోటు దక్కింది. మొక్కలకు నీరు అవసరమైనప్పుడు ఆటోమేటిక్ గా నీరు సరఫరా అవుతుందని ఈ ప్రాజెక్టు యొక్క ఉద్దేశ్యమని పల్లవి ని గైడ్ చేస్తున్న ఉపాద్యాయులు ఆంజనేయులు తెలిపారు. పల్లవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాటర్ ప్లానింగ్ సిస్టమ్ అందరిని అకుట్టుకునేదిగా ఉందని ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ప్రతినిధి శేఖర్ అన్నారు . పల్లవి ని రంగారెడ్డి జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావుతో పాటు పాఠశాల ప్రధానోపద్యాయురాలు ఝాన్సీరాణి, విద్యార్థినీ గైడ్ గా వ్యవహరిస్తున్న వి. అంజనేయులు, ఎస్ఆర్ఎఫ్ ప్రతనిధి శేఖర్ లు అభినందిం చారు.




విద్యుత్ స్థంభాన్ని తీయాలంటున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

## ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమైతున్న ప్రాంతాలలో ఏసీపీ బాలాజీ పర్యటన

బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం) : ట్రాఫిక్ నిర్వాహణ, ప్రమాదాల నివారణకు అన్ని విభాగాల అధికారులు కలసి పనిచేయడం మంచిదని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రాజేందర్ గౌడ్ తో కలసి రాజేంద్రనగర్ సర్కిల్ లో ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. అరాంఘర్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను మార్చాలన్నారు. లక్ష్మీగూడ లో విద్యుత్ స్థంబం రోడ్డుకు దగ్గరగా ఉందని, దానిని మార్చాలన్నారు. దుర్గానగర్ డ్రైనేజీ స్లాబ్ ఎత్తుగా ఉందని, ఆది వాహనాలకు ఇబ్బంది కలిగించకుండ చూడాలన్నారు. పిల్లర్ నెంబర్ 292 వద్ద ఉన్న విద్యుత్ స్థంబాన్ని మర్చాలన్నారు. ఈ పనులన్నింటిపై రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం. విద్యుత్ శాఖ అధికారులతో కలసి వారు పర్యటించారు.



## నేడు శంషాబాద్ లో విద్యుత్ సరఫరాల అంతరాయం

శంషాబాద్, జనవరి 9(ప్రభాత ఉదయం) శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆర్ బి నగర్ లో మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నక్షత్ర, ఆర్.జి.ఐ పోలీస్ స్టేషన్, హుడా కాలనీ, సంపత్ నగర్, హుడా రోడ్డు, మున్సిపల్ ఆఫీస్, కేఎల్ సి సి ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# గ్రామీణ వాతావరణం చూడాలనుందా... సంక్రాంతికి శిల్పారామం పోదాం రండి



శిల్పారామం



గ్రామీణ వాతావరణం



గోరింటాకు స్పెషల్



ఎడ్ల బండి ప్రయాణం

బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం): సంక్రాంతి పండుగ గ్రామీణ ప్రాంతాలలో ఎలా జరుగుతుందో చూడాలనుకుంటున్నారా.... అయితే నగరంలోని హైటెక్ సిటీ సమీపంలో గల శిల్పారామం కు రండి... అక్కడ మీకు సంక్రాంతి సంబరాలు, గ్రామీణ వాతావరణం, ఎడ్ల బండి ప్రయాణం కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ఇండ్లు, కొండలు, గుట్టలు, పచ్చని చెట్లు, జలపాతాలు ఇలా ఒకటేంటి అనేక అందాలను శిల్పారామం లో కన్నులార చూడవచ్చు. మామూలు రోజులలో సైతం ఇవన్నీ కనిపిస్తున్నప్పటికీ సంక్రాంతి పండుగ సందర్భంగా వేలాది మంది జన సందోహం, రంగు రంగుల విద్యుత్ దీపాల మధ్య శిల్పారామం ఎంతో అందంగా, సుందరంగా, కనులకు చూడ ముచ్చటగా ఉంటుంది.

**తక్కువ ధరలకే రక రకాల దుస్తులు :**

శిల్పారామం లో తక్కువ ధరలకే వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉంటాయి. మట్టితో చేసిన పాత్రలు యిక్కడ లభిస్తాయి.

**ఎడ్ల బండి ఎక్కవచ్చు :**

ఎడ్ల బండి పైకి ఎక్కి ప్రయాణం చేయాలనుకుంటున్నారా... అయితే శిల్పారామం కు రండి. పిల్లా పాపలతో చక్కగా ఎడ్ల బండి ప్రయాణం చేయడానికి అవకాశం ఉంటుంది.

**ఇక్కడ గోరింటాకు స్పెషల్ :**

శిల్పారామం లో మహిళలు పెట్టుకునే గోరింటాకు అతి తక్కువ ధరకే పెట్టేవారు రెడీగా ఉంటారు. 50 రూపాయలు మొదలుకొని పెట్టే వారు డిజైన్ ను బట్టి ధరలు తీసుకుంటారు.

**అందమైన పార్కులు , ఆహ్లాద పరిచే పరిసరాలు :**

శిల్పారామం లో అందమైన పార్కులు, ఆహ్లాద పరిచే పరిసరాలు ఉంటాయి. వాటన్నిటి కోసం చెప్పడం, రాయడం సరిపోదు. మీరు వచ్చి చూస్తే గాని ఆ అనుభూతిని పొందుకునే అవకాశం ఉంటుంది. మరి సంక్రాంతికి రెడీ అవుతున్నారా... వెళ్దాం రండి.



విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ వీ పీ ఎన్ పీ ఏ డైరెక్టర్, కేంద్రీయ విద్యాలయ పాఠశాల కమిటీ చైర్మన్ అమిత్ గార్గ్

## విద్యార్థులు బాగా చదవాలి

### ఎస్ వీ పీ ఎన్ పీ ఎ డైరెక్టర్ అమిత్ గార్గ్

బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం) శివరాంపల్లి లోని కేంద్రీయ విద్యాలయం లో ఇంటర్, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి తాము ఎంచుకున్న గమ్యస్థానాలకు చేరుకోవాలని, ఆ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించి వారిని ప్రోత్సహించాలని సర్దార్ వల్లభాయి పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్, శివరాంపల్లి కేంద్రీయ విద్యాలయ కమిటీ ఛైర్మన్ అమిత్ గార్గ్ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ టి.ఏ.వి. శర్మ అధ్యక్షతన పేరెంట్ – టీచర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ గార్గ్ మాట్లాడుతూ, ఇంటర్, పదవ తరగతి చాలా ప్రాముఖ్యమని ఈ తరగతులలో ఉన్న విద్యార్థులు ఇతర వ్యాపకాలపై దృష్టి పెట్టకుండ చదువు పట్ల శ్రద్ధ కలిగి ఉం డాలన్నారు. చదువుకున్న వారికి సమాజంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన ప్రాంత్యాంశాలను చక్కగా చదువుకుని రాణించాలన్నారు. అందుకోసం వారి తల్లిదండ్రులు కూడా విద్యార్థులను గమనిస్తు వారు బాగా చదివేటట్లు చూడాలన్నారు.



రోడ్డు ఎత్తుగా ఉండటాన్ని చూపిస్తున్న బీజేపీ నాయకులు మాగని శివ, తదితరులు

## రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు వేయాలి

బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఒక వైపు సీసీ రోడ్డు వేసిన అధికారులు మరొక వైపు వేయకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక బీజేపీ నాయకులు మాగని శివ అన్నారు. ఎన్ఐఅర్డీపీఆర్ వైపు నుంచి వచ్చే వాహనదారులు రోడ్డు వేయకపోవడం వల్ల ఎత్తుగా ఉన్న సీసీ రోడ్డు నుంచి క్రింద కు వచ్చి పడిపోతున్నారని గుర్తు చేశారు. ఎన్ఐఅర్డీ పీఆర్ వైపు నుంచి వచ్చే దారిలో సీసీ రోడ్డు వేసిన అధికారులు రాజేంద్రనగర్ నుంచి ఎన్ఐఆర్డీవైపు వెళ్లే మార్గంలో కూడా రోడ్డు వేయాలని కోరుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం నిధులు కూడా మంజూరైనాయని చెబుతున్నారు. దీనిపై రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు వేయాలని కోరుతున్నారు.





వ్యవసాయ విశ్వవిద్యాలయం ను సందర్శించిన లయోలా అకాడమీ విద్యార్థులు

## వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన లయోల అకాడమీ విద్యార్థులు

బుద్వేల్, జనవరి 9 (ప్రభాత ఉదయం): అల్వాల్ లోని లయోల అకాడమీ విద్యార్థులు గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ను సందర్శించారు. ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ చదువుతున్న 35 మంది విద్యార్థులు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శిరీష, అసిస్టెంట్ ప్రొఫెసర్లు గురుదేవి. డాక్టర్ కె.పద్మలత ల ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇనిస్టిట్యూట్ అఫ్ బయో టెక్నాలజీ, సెంట్రల్ ఇంస్ట్రుమెంటేషన్ సెల్, హర్టికల్చర్ గార్డెన్, పరిపాలన భవనంలోని అగ్రి ఇన్నోహబ్ ను సందర్శించారు. అంతకు ముందు వారి రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ, భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థను సైతం వారు సందర్శించారు. పలు అంశాలలో అవగాహన పెంచుకునేం దరుకు ఈ పర్యటన ఉపయోగపడిందని విద్యార్థులు తెలిపారు.



## విద్యుత్ సబ్ స్టేషన్‌లో తప్పిన పెనుప్రమాదం

గద్వాల టౌన్, జనవరి 9(ప్రభాత ఉదయం) జిల్లా కేంద్రంలోని నదీఅగ్రహారం రోడ్డులో గల 132/33కేవి విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో గల ఖాళీ ప్రదేశంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. సబ్ స్టేషన్ వెనుక గల ట్రాన్స్ ఫార్మర్ పక్కనే గల ఖాళీ ప్రదేశంలో చెత్త చెదారంతో పాటు గడ్డి ఉండటంతో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గమనించిన విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ప్రమాద స్థలానికి చేరుకున్న ఫైర్ మెన్లు ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను ఆర్పారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారుల స్పందించడంతో భారీ ప్రమాదం, ఆస్తి నష్టం నివారించగలిగారు.



## దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికైన గద్వాల జిల్లా ఉపాధ్యాయుడు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి9(ప్రభాత ఉదయం)మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ సమీపంలో ఉన్న ఎస్‌వీకేఎం స్కూల్‌లో గురువారం రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా ఉపాధ్యాయ ప్రదర్శన విభాగంలో గద్వాల జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు నాగరాజు దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికయ్యారు. ప్రతి జిల్లా నుండి ఒకరు చొప్పున మొత్తం 33 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి.నాగరాజు (సాంఘీక శాస్త్రం) రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ బహుమతిని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, డిఇఓ ప్రవీణ్ కుమార్, ఎస్ సి ఇ అర్ టి డైరెక్టర్ రమేష్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈనెల 21 నుండి 25 వరకు పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జి.నాగరాజు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ ఘని, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నరసయ్య, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.




సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు

## వెల్ఫేర్ బోర్డులోని సెస్సు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలి


కొత్తకోట, జనవరి 9(ప్రభాత ఉదయం) భవన , ఇతర నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు లోని సెస్సు నిధులు కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కని మెట్ట గ్రామంలో బిల్డింగ్ వర్కర్స్ సమావేశంలో కార్మికులు సభ్యత్వం చేశారు అనంతరం ప్రసంగించారు నిర్మాణ కార్మికునికి ప్రమాదానికి ఇస్తున్న 6 లక్షల నుండి 10 లక్షలు పెంచాలని సహజ మరణానికి ఇస్తున్న లక్ష నుండి 5 లక్షల పెంచాలని దహన సంస్కరణల ఖర్చులు వివాహం ప్రసూతి కానుకను 30 వేల నుండి లక్ష రూపాయలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని వెంటనే కార్మిక సంఘాల నాయకులతో నియమించాలని కోరారు కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్ స్కాలర్షిప్లు గృహ వసతి అడ్డాలో మౌలిక సౌకర్యాలు ఇతర పథకాలని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు ఈ సమయంలో దుర్గా భవాని తాపీ కార్మిక సంఘం అధ్యక్షులు ఆకుల రమేష్ ఉపాధ్యక్షులు రాజు కోశాధికారి వెంకటేష్ మాజీ అధ్యక్షులు రామచంద్రయ్య నాయకులు జీ మన్యంకొండ మల్లేష్ మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు



హరి హర క్షేత్రం కు వెళ్ళే మెట్ల దారి ముస్తాబు..



హరి హర క్షేత్రం ముఖ ద్వారం



పుష్పాలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామీ దేవాలయం

## నేడు వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి

బుద్వేల్, జనవరి 9(ప్రభాత ఉదయం):ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాజేంద్రనగర్ లోని హరిహర క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని రంగు రంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 5గంటలకు పల్లకి సేవా ఉ ంటుందని ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. అనంతరం కలియుగ ప్రత్యక్షదైవం వైకుంఠవాసుని ఉత్తర వైకుంఠ ద్వారము నుండి భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన సామర్థ్యం పెంపొందించుకోవాలి



వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి9(ప్రభాత ఉదయం)అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన సామర్థ్యం పెంపొందించుకొనాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. గురువారం గద్వాలలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్లో పాఠశాల విద్యార్థులకు సైన్స్ , టెక్నాలజీ పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన కలాం స్ఫూర్తి యాత్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ... ఏపీజే అబ్దుల్ కలాంతో పాటు ఇస్రో శాస్త్రవేత్తలు స్వయంగా తను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగడం జరిగిందన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు వైజ్ఞానికత,నూతన ఆవిష్కరణలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని కలాం కన్న కలలను సహకారం చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఫ్లో బస్సు ద్వారా రోబోటిక్స్ 3%ణ% ప్రింటింగ్ ఏ ఆర్, వి ఆర్, ఎం ఎల్ వంటి సాంకేతికత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు మొబైల్ వినియోగించడం జరుగుతుందని, రాబోవు రోజులలో అన్ని పనులను రోబోటిక్ ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ యాత్ర ద్వారా ఆధునిక సాంకేతికతను నేరుగా పాఠశాలల విద్యార్థుల వద్దకు తీసుకువెళ్లి వారికి ప్రేరణ కల్పించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు సాంకేతికత పట్ల అవగాహన పెంపొందించుకొని కలాం స్ఫూర్తితో ముందుకు సాగాలని, సైంటిస్టులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫ్లో బస్సులో ఏర్పాటు చేసిన టెక్నాలజీని శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ వీక్షించారు. విద్యార్థులకు ఈ సాంకేతికత ఎంతగానో ఉ పయోగపడుతుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఈ యాత్ర విజయవంతంగా నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలాం స్ఫూర్తి యాత్ర నిర్వహకులకు సూచించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, అబ్దుల్ కలాం కళలను సహకారం చేసేందుకు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని పాఠశాల విద్యార్థులకు ప్రేరణ కల్పించాలనే ఉద్దేశంతో కలాం స్ఫూర్తి యాత్ర నిర్వహించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. నేటి సమాజం సాంకేతికంగా ఎంతగానో అభివృద్ధి చెందిందని, నేడు దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని, దేశాభివృద్ధికి సాంకేతికత ఎంతో అవసరమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కలాం స్ఫూర్తి యాత్రలో భాగంగా బస్సులో ఏర్పాటు చేసిన 16 అంశాలతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తిలకించే విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలన్నారు. వంద మంది చేసే పనిని ఈరోజు ఒక కంప్యూటర్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని, రాబోవు రోజులలో సాంకేతికంగా ఇంకా ఎంతో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులచే ముఖ్య అతిథులకు ఘనంగా మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి జితేందర్, ఉపాధ్యాయులు స్థానిక ప్రజా ప్రతినిధులు, కళ స్ఫూర్తి యాత్ర సీఈఓ మధులాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

### జిల్లా స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ ను ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి9(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని బృందావనం గార్డెన్ లో గురువారం నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి రెండవ తైక్వాండో ఛాంపియన్ షిప్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జోగులాంబ గద్వాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తైక్వాండో క్రీడా పోటీలను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో క్రీడ అనేది ఆత్మరక్షణ విద్య అని, ప్రస్తుత సమాజంలో అందరూ ఈ విద్యను నేర్చుకోవాలని ఆకాంక్షించారు. ఇది వ్యక్తిగత క్రీడ కావడంతో సతా చాటిన వారే విజేతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ రోజు సాధన చేయాలని సూచించారు. ప్రతిభ ఉం టే ప్రపంచ స్థాయికి వెళ్లవచ్చని,తైక్వాండో పోటీల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎన్నో పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరి మాట్లాడుతూ... ఈ క్రీడలలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి సబ్ జూనియర్, క్యాడేట్, జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జనవరి 23 నుండి 30 హైదరాబాద్ లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి తైక్వాండో క్రీడలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ జితేందర్, కౌన్సిలర్లు మరియు నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజలకు విద్యుత్ నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



గోపాల్ పేట మండలం ఏదుట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి బట్టి విక్రమార్క



మంత్రి భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

వనపర్తి జిల్లా ప్రతినిధి, జనవరి 9(ప్రభాత ఉదయం) వనపర్తి నియోజకవర్గంలో గోపాల్ పేట మండలం ఏదుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పి జి ఎస్ పి డి సి ఎల్ సిఎండి ముషారఫ్, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి , వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పార్టీ భట్టి మాట్లాడుతూ... ప్రజలకు నిరంతర విద్యుత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళు తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చందర్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామి గిరి ప్రదక్షణను విజయవంతం చేద్దాం: గోపాలకృష్ణ గురుస్వామి



దీక్షలో స్వాములు

కురుమూర్తి, జనవరి 9(ప్రభాత ఉదయం): ఈ నెల 11 వ తేదీ శనివారం పేదల తిరుపతి గా పేరొందిన శ్రీ కురుమూర్తి స్వామి క్షేత్రం లో సాక్షాత్తు తిరుమల తిరుపతి వెంకటేశుడే మనకోసం ఇక్కడ వెలిసాడాని అంతటి మహిమ గల కొండచుట్టూ పాలమూరు జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గిరిప్రదక్షణ కార్యక్రమం లో సమస్త అయ్యప్ప భక్తులు , శివ స్వాములు , హిందూ బంధువులు అందరూ తప్పక పాల్గొనాలని హిందూ బంధువులందరూ మమేకమై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయ్యప్ప సేవాసమితి , శ్రీ భూతనాథ అయ్యప్ప అన్నప్రసాద క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ గోపాలకృష్ణ గురుస్వామి పిలుపు నిచ్చారు కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు శ్రీ ధూపం నాగరాజు గురుస్వామి , ప్రధాన అర్చకులు జంగం నటరాజ్ , సత్యం సాగర్ , వేముల సుధాకర్ రెడ్డి , భీమ కిషోర్ , దాసరి సురేష్ మరియు అయ్యప్ప భక్తులు , శివ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

### తహసీల్దార్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి9(ప్రభాత ఉదయం) మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామంలోని 102, 103 సర్వేనెంబర్లో గల ప్రభుత్వ భూమిలో లబ్దిదారుల ప్లాట్లను అక్రమించుకుని అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని లబ్దిదారులకు న్యాయం చేయాలని లక్ష్మమ్మ, శాంతమ్మ, తదితరులు కోరారు. ఉలిగేపల్లి శివారులో గల సర్వే నంబర్ 102, 103 లోగల ప్రభుత్వ స్థలంలో కొంతమంది కబ్జాదారులు ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. 1995 సంవత్సరంలో 85 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ప్లాట్లను పంపిణీ చేసిందన్నారు. గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి తనకు ఇచ్చిన ప్లాట్లలో గతంలోనే ఇండ్లను నిర్మించుకున్నాడు. తాజాగ తిమ్మయ్య లబ్దిదారులకు ఇచ్చిన ప్లాట్లను అక్రమించుకొని ఇండ్ల నిర్మాణ చేపట్టాడన్నారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి పట్టాలు లేకున్న అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో ఇండ్ల నిర్మాణం చేపడుతున్నట్లు లబ్దిదారులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో పంపిణి చేసిన ఇండ్ల పట్టాల లబ్దిదారులు ప్లాట్లలో నిర్మాణం ఎందుకు చేపడుతున్నావని లబ్దిదారులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా బెదిరింపులు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అప్పటికే ప్రభుత్వ ప్లాట్లను అక్రమించుకుని పశువుల దొడ్డి ఏర్పాటు చేసుకున్నాడని అరోపించారు. అక్రమ నిర్మాణాలను నిలిపి వేసి నిజమైన లబ్ధిదారులకు ప్లాట్లు దక్కేలా న్యాయం చేయాలని మల్దకల్ తహసిల్దార్ కు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని, జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని లబ్దిదారులు కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608